




పిఠాపురం.. ఇక నా స్వస్థలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

- ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుంటా
- నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్
- జనసేనలో భారీగా చేరికలు

పిఠాపురం, ఏప్రిల్ 1: 'పిఠాపురాన్ని నా స్వస్థలం చేసుకోవడానికే ఇక్కడకు వచ్చా. నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదో ఒకచోట ఇల్లు తీసుకుని ఉంటా. నన్ను ఒక్కసారి గెలిపించమని భగవంతుడిని కోరితే పిఠాపురం పిలిచింది. మనం భారీ మెజార్టీతో గెలవబోతున్నామ'ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు, వివిధ వర్గాల ప్రముఖులు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారందరికీ పవన్ జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పిఠాపురం నియోజకవర్గంలోని అందరినీ వ్యక్తిగతంగా కలవాలన్న ఆశ తనకు ఉన్నప్పటికీ భద్రతాపరమైన కారణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పవన్ తెలిపారు. ప్రత్యర్థుల పన్నాగాలు గమనిస్తూ మనమంతా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. భద్రతాపరమైన ప్రొటోకాల్ పాటిస్తూ రోజుకి 200 మందిని కలిసి వారితో ఫొటోలు తీసుకుంటానని తెలిపారు. శ్రీపాదశ్రీవల్లభుడు, పురుహూతికా అమ్మవారు, బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా, ఆంధ్రా బాప్టిస్టు చర్చి సాక్షిగా ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తాను భగవంతుడినీ ఏదీ కావాలని కోరుకోనని, అయితే సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతున్న సమయంలో నల్గొండకు చెందిన అభిమాని వచ్చి ఒక్క హిట్ ఇవ్వు అన్నా అని అడిగాడు. అప్పుడు ఒక్క హిట్ ఇవ్వమని, భీమవరంలో ఓడిపోయిన తర్వాత గెలుపు ఇవ్వమని భగవంతుడిని కోరానని తెలిపారు. ఆ మేరకు తనను పిఠాపురం పిలిచిందని చెప్పారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఉండాలన్నదీ త్వరలో నిర్ణయించుకుంటానని, పురుహూతికా అమ్మవారి ఆశీస్సులతో ఇక్కడే ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుని ఉంటానన్నారు. పగిలే గాజు గ్లాసుకు పదును ఎక్కువన్నారు. అందరినీ ప్రత్యేకించి కలుస్తానని, ప్రతి ఒక్కరి సమస్యలనూ తెలుసుకుంటానని తెలిపారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. అందుకు కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ నిదర్శనమన్నారు. వచ్చే 25 సంవత్సరాల్లో కొత్తతరం నాయకులు ముందుకు రావాలని కోరారు. ఇప్పటి నుంచీ నిలబడితేనే రేపటి రోజున నాయకులు తయారవుతారని తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి వరకు నాయకులను తయారు చేస్తుందని చెప్పారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు వేములపాటి అజయకుమార్, పి.హరిప్రసాద్, మర్రెడ్డి శ్రీనివాస్, కె.శరత్, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, తెలంగాణా ఇన్‌చార్జి ఎన్.శంకరగౌడ్, మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు పాల్గొన్నారు. పిఠాపురం నియోజకవర్గం, ఇతర ప్రాంతాల ప్రముఖులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. వారిలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి, న్యాయవాదులు సూరవరపు వెంకటేశ్వరరావు, త్రినాథ్, వెంకటరమణ, అరుణ్‌బాబు, కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి, వంతల నందీశ్వరి, సూరవరపు సురేష్, మారిశెట్టి బుజ్జి, ఊటా సత్యనారాయణ, ఎలుబండి ప్రభు, డాక్టర్ ఆర్.మోహనరావు, కోడిగుడ్డి రాజేష్, గారపాటి శ్రీనివాసరావు, బస్వా ప్రసాద్, మేరుగు జగదీష్, ఎండీ జాఫర్ షరీఫ్, షేక్ ఖాదీర్, నజీర్, అబ్దుల్ ఖయూమ్, లోకారెడ్డి రామకృష్ణ, బొజ్జా లోవరాజు, యాపాటి అరుణ్‌బాబు, కుక్కాశ్రీను ఉన్నారు.

నేటి పర్యటన ఇలా..

సోమవారం మధ్యాహ్నం 1.40 గంటలకు గొల్లప్రోలులోని హెలిపాడ్‌కు చేరుకున్న పవన్‌కల్యాణ్ సాయంత్రం 5.15 గంటలకు గొల్లప్రోలు హెలిపాడ్ నుంచి హైదరాబాదుకు హెలికాప్టర్‌లో పయనమయ్యారు. ఆయన తిరిగి మంగళవారం నియోజకవర్గానికి వస్తారు. ఉదయం 9 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి పిఠాపురంలోని ఏబీసీ (ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్)కు, తర్వాత కొత్తపల్లి మండలం పొన్నాడలోని బషీర్‌బీబీ దర్గా (బంగారు పాప)లకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. తర్వాత యు.కొత్తపల్లి మండలం కొత్తపల్లిలోని సురక్ష ప్యాలెస్ ఫంక్షన్ హాలులో మహిళలతో సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి పిఠాపురం చేరుకుని వివిధ జంక్షన్లలో పర్యటిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని జనసేన కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.





పిఠాపురంలో జనసేన పార్టీలో చేరిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వరలక్ష్మి... కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవి

జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

పిఠాపురం, ఏప్రిల్ 1: జనసేన పార్టీలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు చేరేందుకు పిఠాపురం వేదిక అయ్యింది. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలోని గోకులం గ్రాండ్ హోటల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ, రైల్వేకోడూరు నియోజకవర్గం సర్పంచ్ శ్రీధర్ పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పవన్ సాదర స్వాగతం పలికారు. పార్టీలో చేరిన అనంతరం మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీకి నిలవమని పవన్ తనను కోరగా చంద్రబాబు మద్దతు ఇచ్చారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఏపీలో జరగని అరాచకం లేదని మండిపడ్డారు. వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. తెలుగు భాషాభివృద్ధికి తాను చేసిన కృషిని పవన్ ఎన్నోసార్లు మెచ్చుకున్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గానికి చెందిన నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ తనకు సీటు వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. పాలకొండలో వైసీపీ అక్రమాలు దారుణంగా ఉన్నాయని తెలిపారు.



రావులపాలెంలో చంద్రబాబు సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కూటమి నాయకులు

రేపటి నుంచి చంద్రబాబు ప్రజాగళం

- రేపు రావులపాలెం, రామచంద్రపురంల్లో సభలు
- 4న గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో పర్యటన
- అనంతరం 'పశ్చిమ'కు పయనం - వేడెక్కిన రాజకీయం

రావులపాలెం/అమలాపురం/నల్లజర్ల/రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి గోదావరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆయన కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు కోనసీమ ముఖద్వారమైన రావులపాలెంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్, జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. రావులపాలెం కెనాల్ రోడ్డులో బహిరంగ సభా స్థలి ప్రదేశం, మల్లాయిదొడ్డిలో హెలిపాడ్ ఏర్పాటు, అక్కడకు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో ముఖ్య నేతలతో మాట్లాడేందుకు వీలుగా ఉన్న కల్యాణ మండపాన్ని పరిశీలించారు. రావులపాలెం సభ అనంతరం రామచంద్రపురం పర్యటనకు చంద్రబాబు హెలికాప్టర్‌లో వెళతారని సమాచారం. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామలో బుధవారం సాయంత్రం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రెండు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటన కొనసాగుతుందని టీడీపీ నేతలు చెప్తున్నారు. రాత్రి రామచంద్రపురంలో బస చేసే అవకాశం ఉంది. ఈ మేరకు నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4వ తేదీ గురువారం పర్యటిస్తారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం స్థల సేకరణ పనిలో టీడీపీ నాయకులు నిమగ్నమయ్యారు. నల్లజర్లలో లేదంటే గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో బహిరంగ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొవ్వూరులోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, పాలకొల్లు నియోజకవర్గాల్లో 5న పర్యటించనున్నారు. ఇప్పటికే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పరిధిలోని పిఠాపురంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆయన రాకతో రాజకీయం వేడెక్కింది. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా రానుండడంతో కూటమిలో మరింత జోష్ పెరగనుంది. ఈ నెల 5 నుంచి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి బరిలో దిగనున్నారు.



ఎన్నికల నిబంధనావళి పక్కాగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసే జిల్లా కేంద్ర కార్యాలయం కలెక్టరేట్. అయితే సోమవారం పలు వాహనాలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మరీ ఆ ప్రాంగణంలోకి వచ్చాయి. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఇసుక కార్మికుల కోసమంటూ కలెక్టరేట్‌కు తన అనుచరులతో కలిసి వాహనాలతో వచ్చారు. ఆయా వాహనాలపై సీఎం జగన్ ముఖ చిత్రంతో చిన్నచిన్న పోస్టర్లే కాదు... సిద్ధం ... మళ్లీ జగనే కావాలి.. మళ్లీ జగ్గిరెడ్డే కావాలి అంటూ ఏకంగా పెద్దపెద్ద పోస్టర్లు అతికించారు. ఆ కార్లను సుమారు గంటసేపు పార్కింగ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అయినా సదరు అధికారులకు అవేమీ కనిపించలేదా అని వ్యాఖ్యానించిన వారూ వున్నారు.

...అమలాపురం టౌన్

అయితే మాకేంటి....!



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల ఫెక్సీలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా కొందరు అధికార పక్ష నాయకులు మాకేంటి అన్న రీతిలో వున్నారు. ముక్కామల ఎంపీటీసీ వనచర్ల విజయదుర్గ ఇంటిపైన 'సిద్ధం' ఫ్లెక్సీ. అటుగా వెళ్తున్న అందరికీ కనిపిస్తున్నా... అధికారులకు మాత్రం కనిపించట్లేదట!

...అంబాజీపేట

జగ్గిరెడ్డి హైడ్రామా!

- ఇసుక రీచ్‌ల మూతతో జట్టు, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని కొత్తపేట ఎమ్మెల్యే ఆవేదన
- వారితో కలెక్టరేట్ ఎదుట 'బల' ప్రదర్శన
- తక్షణం తెరవాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం
- టీడీపీ నేతల వల్లే కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆరోపణ
- ఆదాయం కోల్పోయింది అధికారపక్ష నేతలేనంటూ తెలుగుదేశం పార్టీ ఎదురు దాడి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులను నిలిపివేయడం వల్ల ఉపాధి కోల్పోయింది ఎవరు? ర్యాంపుల్లో పనిచేసే కార్మికులా లేక ఎన్నికల్లో ఖర్చుల కోసం అర్రులు చాస్తున్న అధికార వైసీపీ నాయకులా అనే అంశం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. గత ఐదేళ్ల పాలనలో ఏనాడూ భవన నిర్మాణ కార్మికుల గురించి గానీ, ఇసుక ర్యాంపుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం గురించి గానీ పట్టించుకోని అధికార వైసీపీకి చెందిన ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి వారిపై ఎన్నలేని ప్రేమ పొంగుకొచ్చింది. ర్యాంపులుమూసి రెండు, మూడు రోజులు కూడా గడవక ముందే ఇసుక ర్యాంపుల్లో పనిచేసే జట్టు కార్మికులు, టిప్పర్ల డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి అల్లాడిపోతున్నారంటూ వారిని ముందుపెట్టి టీడీపీపై సరికొత్త ఆరోపణలు చేశారు జగ్గిరెడ్డి. అప్పుడే ఇసుక కొరత ముంచుకొచ్చేస్తోందని, కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తూ వారి పొట్ట కొడుతున్నారంటూ విరుచుకుపడ్డ వైనాన్ని టీడీపీ నేతలు తిప్పికొడుతున్నారు. ఉపాధి కోల్పోయింది వైసీపీ నాయకులా లేక కార్మికులా అని ఎదరు దాడికి దిగుతున్నారు. ర్యాంపుల్లో మాత్రం ఎప్పుడూ భారీ ఎక్సకవేటర్ల సహాయంతోనే కూలీలతో పని లేకుండా కోట్ల విలువైన ఇసుక సంపదను అనధికారికంగా కొల్లగొట్టడంలో సిద్ధహస్తులుగా వైసీపీ నేతలు చరిత్రకెక్కారు.

ఇంతకీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి బాధేమిటంటే ఆయన ప్రాతినిధ్యం వహించే కొత్తపేట నియోజకవర్గ పరిధిలో ఏడు ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలను నిలిపి వేయాల్సిందిగా ఎట్టకేలకు ధైర్యం తెచ్చుకున్న జిల్లా యంత్రాంగం ఎన్నికల నియమావళి పేరుతో ఆదేశాలు జారీ చేసింది. దాంతో ప్రత్యక్షంగా ఇసుక విక్రయాల వల్ల నిత్యం వచ్చే లక్షలు రూపాయల ఆదాయం కోల్పోవడంతో పాటు, గనులు, భూగర్భ శాఖల అధికారులకు చెల్లించాల్సిన పన్నుల వసూళ్ల రూపంలో ఇసుక లారీల నుంచి వసూళ్లు చేసే సొమ్ములు నిలిచిపోవడంతో వైసీపీ నేతలు కంగుతిన్నారు. కళ్ల ముందే లక్షల ఆదాయం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ పెద్దలు కార్మికుల ఉపాధి కోల్పోయేలా చేస్తున్న టీడీపీ నేతల వైఖరిని తప్పుపట్టారు. మూసేసిన ఏడు రీచ్‌లను తక్షణం తెరవాలని సోమవారం జగ్గిరెడ్డి అమలాపురంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల నుంచి జట్టు కార్మికులను ఆటోల్లో తరలించి కలెక్టరేట్ ఎదుట ఓ చిన్న బల ప్రదర్శన చేశారు.

కాగా జగ్గిరెడ్డి తన వాగ్ధాటితో మీడియాను రక్తికట్టించారు. ఈ వ్యవహారంపై కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు జగ్గిరెడ్డిపై ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. ర్యాంపుల ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడడంతో జగ్గిరెడ్డి కార్మికులను వెంటేసుకుని టీడీపీకి వ్యతిరేకంగా ఉసిగొల్పుతున్నారని, వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసన్నారు.



కలెక్టరేట్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న జగ్గిరెడ్డి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్లు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచే ఓటింగ్ విధానాలు అమలు చేయాలని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం ఆయన జేసీ నుపూర్‌అజయ్‌తో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులతో పాటు అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు బీఎల్‌వోల సహకారంతో ఇంటి నుంచే ఓటు వేసే విధానాన్ని అమలు చేయాలని... అందుకు సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు ఎ.మదన్‌మోహనరావు, ఎ.శ్రీరామచంద్రమూర్తి, ఎస్.సుధాసాగర్, జి.కేశవర్ధనరెడ్డి, జీవీవీ సత్యనారాయణ, పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్లు పి.సుబ్రహ్మణ్యం, టి.వైద్యనాథశర్మ, పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

- సమగ్రంగా రూపొందించి అమలు చేయాలి
- అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. జూన్ నెలాఖరు వరకు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి స్టోరేజీ ట్యాంకులను, తాగునీటి రిజర్వాయర్లను కాల్వలు మూసివేసేలోగా పూర్తిగా నీటితో నింపుకోవాలన్నారు. నిర్మాణం పూర్తికావచ్చిన మంచినీటి పథకాలన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి అందుకు అనుగుణంగా ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ చర్యలపై సమీక్షించారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో వడగాల్పులు, ఎండ తీవ్రత పెరిగిన దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ జారీ చేసే హెచ్చరికలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే వేతన జీవులకు పని ప్రాంతాల్లో టెంట్లు వేసి వేసవి కార్యాచరణ ప్రణాళికలను అమలుచేస్తూ గరిష్ఠ వేతనాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీలో పంట కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ అమలుకు సంబంధించి వేసవి అలవెన్సును కూడా ప్రభుత్వం పెంచిందన్నారు. పని ప్రాంతాల్లో తాగునీటి వసతి కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	సా.6.25
సహరీ (బుధ)	ఉ.4.34

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	26

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు వీరే

కాకినాడ	ఎంఎం పళ్లంరాజు
రాజమహేంద్రవరం	గిడుగు రుద్రరాజు

వివరాలు 7లో....

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

జిల్లాలో 377 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రబీ సీజన్లో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- రైతు భరోసా కేంద్రాల్లో సేకరణ ప్రారంభం
- మార్కెట్ ధర కల్పించేందుకు అధికారులు కృషి చేయాలి
- జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం సేకరణకు 377 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. సోమవారం నుంచి జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రారంభించామన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,183, గ్రేడ్-ఎ రకం రూ.2,203కు కొనుగోలు చేశామన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సోమవారం ఆమె ఒక ప్రకటనలో కోరారు. రబీ సీజన్లో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించామన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు మార్కెటింగ్, పౌరసరఫరాలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు కృషి చేయాలని జేసీ సూచించారు. ధాన్యం సేకరణ సమయంలో శాంపిల్స్ సేకరణ, పాటించాల్సిన ప్రమాణాలు, తేమ శాతం తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు అనుగుణంగానే ధాన్యం సేకరణ జరపాలన్నారు. రైతులు పండించిన పంటను కళ్లం వద్ద నుంచి మిల్లుల వద్దకు చేరవేసే క్రమంలో రైతులు, మిల్లర్లకు మధ్య దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. అధికారుల ప్రమేయంతోనే ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు కోతలు కోసి కుప్పలు వేసిన తర్వాత ధాన్యాన్ని బస్తాలుగా నింపే సమయంలో గోనె సంచుల కొరత గానీ, హమాలీల కొరత గానీ లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలున్నా జిల్లా కంట్రోల్ రూమ్‌లోని 8309432487, 94416 92275 నెంబర్లకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటలలోపు నేరుగా ఫోను చేసి నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.

భార్య మృతి కేసులో భర్తకు రెండేళ్లు జైలు శిక్ష ... 8లో



మాక్ పోలింగ్ తప్పనిసరి

సామర్లకోట, ఏప్రిల్ 1: గత ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా ఎన్నికల నిబంధనల అమలులో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ పోలింగ్ ప్రారంభానికి గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించి పోలింగ్‌కు సన్నద్ధం చేయాలి. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం రాని రీతిలో పీవోలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఏమాత్రం విధుల్లో పొరపాట్లు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవు. పోలింగ్ రోజున వీలైనంత వేగంగా పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలి. ఒక ఓటరు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేసి తిరిగి వచ్చేందుకు 7 నిమిషాల సమయం పడుతుంది. దానిని దృష్టిలో ఉంచుకుని ఇతర పనులు పూర్తిచేయాలి. ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ 90 నిమిషాలకు ముందు తప్పనిసరిగా మాక్‌పోలింగ్ నిర్వహించాలని, అనంతరం ఈవీఎంలను డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్‌లు ఖాళీ చేసి సీల్ చేయాలి. మాక్ పోలింగ్ జరగకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉంది. ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్ పూర్తి కావాలని ప్రతీ పోలింగ్ కేంద్రానికి పీవోతో పాటు నలుగురు సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల విధులకు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులను మాత్రమే నియమిస్తారు. వలంటీర్లు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అవకాశం ఎంతమాత్రం లేదు. ఎన్నికల నిర్వహణపై శిక్షణ మూడు విడతల్లో నిర్వహించాలి.

'సోషల్' ప్రచారానికి
అనుమతి ఉండాల్సిందే





సామర్లకోట, ఏప్రిల్ 1: వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్రచారానికి కూడా ముందస్తు అనుమతి పొందాల్సిందేనని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు ఆర్వో అధికారులకు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి గురువారం రాత్రి సమాచారాన్ని సేకరించింది. ఈ-పేపర్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, వికీపీడియా, వర్చువల్ గేమ్ వరల్డ్, ఎస్ఎంఎస్ వాయిస్ మెసేజ్, ఎఫ్ఎం ఛానెల్స్, ఐవీఆర్ కాల్స్, సినిమా హాల్స్ ప్రకటనలు, రేడియో, బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించే ఆడియో విజువల్స్ తదితరాలు మీడియా ఎలక్ట్రానిక్స్ పరిధిలోకి వస్తాయని అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. మీడియా సర్టిఫికేషన్ మోనిటరింగ్ కమిటీ దీనికి అనుమతులు ఇస్తుందని పేర్కొన్నారు. ముందస్తు ధ్రువీకరణ పత్రాలు పొందకుండా సోషల్ మీడియాలో ఎటువంటి ప్రచారం చేసినా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం దగ్గర నమోదైన రాజకీయ పార్టీలు కనీసం 3 రోజుల ముందుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోని ఎంసీఎంసీ సెల్‌లో సంబంధిత అధికారికి ప్రీ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు సమర్పించాలి. నమోదు కాని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు 7 రోజుల ముందుగా దరఖాస్తు సమర్పించాలి. ప్రచారం చేయడానికి ప్రతిపాదించిన అంశం స్క్రిప్ట్ ఎలక్ట్రానిక్ ఫార్మెట్‌ను రెండు ప్రతులలో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు ప్రకటన నిర్మాణ ఖర్చు రోజుకు ఎన్నిసార్లు ప్రచారం చేస్తున్నదీ ప్రతీ ప్రచారానికి ఎంత ఖర్చు తదితర వివరాలు సోషల్ మీడియా ప్రకటనలకు తయారీ ఖర్చు సంబంధిత సిబ్బందికి చెల్లిస్తున్న వేతనాలు తదితర అంశాల వివరాలు అందించాలి. పోటీలో ఉన్న అభ్యర్థి కానీ అభ్యర్థి ధ్రువీకరించిన వ్యక్తి గాని దరఖాస్తు సమర్పించాలి. ప్రకటనలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తిగా పాటించాలి. ప్రకటనలలో ఎటువంటి అభ్యంతరకర అంశాలు, పదాలు, వ్యాఖ్యలు ఉండరాదు. జాతి, మత, ప్రాంత, భాష, సామాజిక వర్గ విభేదాలు సృష్టించే విధంగా ఉండే అంశాలు గాని, వ్యక్తిగత దూషణలు గాని, భావోద్వేగాలు రెచ్చగొట్టే అంశాలు కానీ ఉండరాదు. పెయిడ్ న్యూస్, ఎన్నికల సమయంలో అభ్యర్థులు జారీ చేసే ప్రకటనల ఖరీదును సంబంధిత అభ్యర్థి వ్యయ ఖాతాలో జమ చేస్తారు. ప్రీ సర్టిఫికేషన్ లేకుండా ఎటువంటి ప్రకటనలను ప్రదర్శించే కేబుల్ నెట్ వర్క్‌ల ప్రతినిధులు నియమావళిని పాటించాల్సిందే. ప్రింట్ మీడియా ప్రకటనలకు కూడా అనుమతి తప్పనిసరి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం ముగిసిన తేదీ సాయంత్రం నుంచి పోలింగ్ రోజుకు మధ్య 48 గంటల సమయంలో కూడా అనుమతులు పొందాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలలో స్పష్టం చేశారు.



క్షణంలో ఘోరం

ట్యాంకర్ పేలి ఇద్దరు దుర్మరణం





ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన ప్రభాకర్, శామ్యూల్

గొల్లప్రోలు రూరల్, మార్చి 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులోని కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రోడ్డులో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలడంతో ఇద్దరు అక్కడికక్కడ మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన గాబు గంగాధర్ తన ఆయిల్ ట్యాంకర్‌ను మరమ్మతుల నిమిత్తం అదే గ్రామంలోని సత్యాదుర్గా ఆర్క్ వెల్డింగ్ ఇంజనీరింగ్ వర్క్స్‌కు ఇచ్చారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులోని కత్తిపూడి నుంచి రావికంపాడు వెళ్లే రోడ్డులో ట్యాంకర్ వెనుక భాగంలో సోమవారం ఉదయం 9 గంటలు నుంచి వెల్డింగ్ పనులు ప్రారంభించారు. పోలవరం కాలువ పక్కనే పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆయిల్ ట్యాంకర్ వెనుక భాగం పేలిపోయింది. ఆ పేలుడు తాకిడికి ట్యాంకర్ భాగాలు తగలడంతో శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బూర సోమరాజు అలియాస్ శామ్యూల్ (39), వెల్డింగ్ వర్కర్ కొచ్చెర్ల ప్రభాకర్ (38) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో వెల్డింగ్ షాపు యజమాని నున్న లోవరాజు, మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు పరిశీలించారు. శామ్యూల్ భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా శామ్యూల్‌కు భార్య, కుమార్తె సమీర, కుమారుడు వరుణ్, ప్రభాకర్‌కు భార్య చిన్నారి, పిల్లలు త్రినాథ్, తేజస్విని, చందు ఉన్నారు.

కుటుంబాల్లో విషాదం

శంఖవరం, ఏప్రిల్ 1: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివారులో జరిగిన ప్రమాదం కత్తిపూడిలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడగా మరో ముగ్గురు గాయపడ్డారు. చనిపోయిన వారు ఇద్దరూ రోజు వారీ కూలి వస్తేనే జీవనం గడిపే పరిస్థితి. వెల్డింగ్ చేసే కొంజర్ల ప్రభాకర్‌కు (38) భార్య చిన్నారి, కుమారులు త్రినాథ్, చందు, కుమార్తె తేజస్విని ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేసే బూరా సోమరాజు (39)కు భార్య ప్రియాంక, కుమార్తె సమీర, కుమారుడు వరుణ్ ఉన్నారు. ఈ ఇద్దరి సంపాదనతోనే ఆయా కుటుంబాలు నడుస్తున్నాయి. అప్పటివరకూ అందరితో కలిసి మెలిసి ఉండే వారిపై ఒకేసారి ఉప్పెనలా మృత్యువు దూసుకొచ్చిందని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెల్డింగ్ షాపు యజమాని నున్న లోవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మరో ముగ్గురికి కళ్లల్లో ఆయిల్ పడడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్సనందించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు.



ప్రభాకర్



శామ్యూల్

ఘనంగా ఆలయ పునర్నిర్మాణ వేడుకలు

- రత్నగిరిపై ప్రత్యేక పూజలు, నివేదన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పండితులను సత్కరించిన అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయ పునర్నిర్మాణ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున 4 గంటలకు మూలవరులను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. విశేష పదార్థాలను నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నాటి ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన పండితులను దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్ర మోహన్ సత్కరించారు. ఈ సందర్భంగా నాటి అనుభవాలను పండితులు వివరించారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణంలో అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఆలయాన్ని పునర్నిర్మించాలని 12 ఏళ్ల క్రితం నివేదిక ఇచ్చినా ఏ అధికారి సాహసించలేకపోయారని పండితులను శృంగేరీ పీఠానికి తీసుకెళ్లి వారి సూచనలతో ఏడాది వ్యవధిలోనే పూర్తిచేయడం అభినందనీయమని అన్నారు. పుష్కరకాలం తర్వాత మరలా అన్నవరం దేవస్థానానికి రావడం ఇప్పుడు బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు, జాతీయరహదారిపై నమూనాలయం నిర్మాణం పూర్తి ఆయన చేతుల మీదుగా జరగడం పూర్వ జన్మ సుకృతమని అన్నారు. ఈ సందర్భంగా దేవదాయ కమిషనర్ ఈవోను సత్కరించారు. సత్కార గ్రహీత రామచంద్రమోహన్ మాట్లాడుతూ తన బాధ్యతను మాత్రమే నిర్వహించానని సిబ్బంది అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేయగలిగానని అన్నారు. అనంతరం ఆయన సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన వెండి ధ్వజ స్తంభాన్ని పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తా

పలువురికి గాయాలు



గాయపడిన విద్యార్థులు

సామర్లకోట, ఏప్రిల్ 1: సామర్లకోట పట్టణ శివారు బ్రౌన్‌పేట వద్ద గల వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు వెళుతున్న ఆటో విస్తరణ శిక్షణా కేంద్రం సమీపంలో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దాపురం మండలం ఆర్‌బీ. కొత్తూరు, రాయభూపాలపట్నం, పెద్దాపురం ప్రాంతాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ఒకే ఆటోలో కళాశాల నుంచి ఇంటికి తిరుగు ప్రయాణం కాగా సోమవారం సాయంత్రం ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే ప్రయత్నంలో ఆటో డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో ఒక్కసారిగా రెండు పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు రోడ్డుపై చిందరవందరగా పడిపోయారు. పలువురికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. వారిలో ఒక విద్యార్థినికి తలపై గాయం కావడంతో ఏడీబీ రోడ్డులో ఉన్న మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట ఎస్ఐ మౌనిక క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. కేసు సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

స్థలములు అమ్మకం

Rjy బొమ్మూరు మురళీ కొండ E/S కార్నర్ 300 చ॥గ॥ & మోరంపూడి పిట్టలవాని చెర్వు వద్ద E/F 225 చ॥గ॥ స్థలాలు అమ్మకం సెల్: 8500808089, 8328087318
AJD:177165

TO LET OR RENT

★ జయకృష్ణాపురంలో పైన మరియు కింద పోర్షన్‌లు అద్దెకు కలదు. సంప్రదించగలరు ఫోన్ నంబరు: 9398265413 AJH-56682

4 Lines CLASSIFIED Rs.230/- Only

దివ్యాంగురాలిపై అత్యాచార యత్నం

ఆత్రేయపురం, ఏప్రిల్ 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలో ఓ దివ్యాంగురాలిపై సోమవారం ఓ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తల్లిదండ్రులు కూలిపనికి వెళ్లగా దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉంది. దీనిని గమనించిన అదే ప్రాంతానికి చెందిన అంజి అనే యువకుడు ఇంట్లోకి ప్రవేశించి దివ్యాంగురాలిపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఆ యువకుడు పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదం డ్రులకు ఆమె బోరున విలపించి విషయాన్ని చెప్పింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు.

మావోయిస్టుల కరపత్రాలు కలకలం





ఎటపాక, ఏప్రిల్ 1: భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) పేరుతో సోమవారం కూనవరం- భద్రాచలం రోడ్‌లోని గౌరిదేవిపేట- గన్నవరం గ్రామాల మధ్యలో రహదారిపై మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి ఈ కరపత్రాలు చర్ల- శబరి ఏరియా కమిటీ మావోయిస్టుల పేరుతో ప్రత్యక్షమయ్యాయి. రహదారిపై పక్కన ఉన్న వృక్షాలపై కరపత్రాలను అంటించారు. ఇందులో దగాకోరు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని, కార్పొరేట్ కంపెనీల మైనింగ్స్, ప్లాంట్లు, రోడ్లు, డ్యామ్‌లు ప్రాజెక్టులను నిలిపి వేయాలని పేర్కొన్నారు. ఆదివాసీల స్వయం ప్రతిపత్తికి, చట్టాలకు భంగం కలిగించే పోలీస్ క్యాంపులు, ఉద్యమాలను అణిచివేసే పారా మిలటరీ, స్పెషల్ బలగాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల వ్యవధిలో ఎటపాక మండలంలో రెండో సారి మావోల కరపత్రాలు కనిపించడం పోలీసులకు సవాలుగా మారుతోంది. గత శనివారం కనాయిగూడెం- తూర్పుబాక మధ్యలో, అలాగే చెన్నంపేట- సీతంపేట గ్రామాల మధ్యలో కరపత్రాలు కనిపించిన సంగతి తెలిసిందే.. కాగా మావోల కరపత్రాల సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నారు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు..

కాకినాడకు పళ్లంరాజు, రాజమహేంద్రవరానికి రుద్రరాజు



కాకినాడసిటీ, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజును కాంగ్రెస్ సీఈసీ ఖరారు చేసింది. కాకినాడ ఎంపీగా ఆయన ఏడోసారి బరిలో నిలువనున్నారు. తొలిసారి 1989లో పోటీ చేసి గెలుపొందారు. తర్వాత 1991లో మధ్యంతర ఎన్నికల్లో, 1998 మధ్యంతర ఎన్నికల్లో ఓటమి చెందారు.1999లో కాకినాడ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. 2004, 2009 ఎన్నికల్లో కాకినాడ పార్లమెంట్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2006 నుంచి 2014 మధ్యకాలంలో కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రిగా, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు. 2014లో పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికలకు పళ్లంరాజు దూరంగా ఉండి ఆయన బాబాయ్ మల్లిపూడి రాంబాబును పోటీలో ఉంచారు.

రాజమహేంద్రవరం నుంచి గిడుగు రుద్రరాజు



రాజమహేంద్రవరం, ఏప్రిల్.1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన రుద్రరాజు కాంగ్రెస్‌లో సీనియర్ నేత. కార్యకర్త స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగారు. వైఎస్ షర్మిలారెడ్డి పీసీసీ ప్రెసిడెంట్ అయ్యే వరకూ ఆయనే కొనసాగారు. ఈ ప్రాంతంలో చాలా మందికి ఆయన సుపరిచితుడు. ఇంతవరకూ టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి, వైసీపీ మధ్యనే లోక్‌సభలో పోటీ ఉంటుందని అందరూ భావించారు. రుద్రరాజు ప్రకటనతో ఇప్పుడు త్రిముఖ పోరు ఖరారైంది.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి





కొవ్వూరు, ఏప్రిల్ 1: ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లుకు చెందిన షేక్ అబ్దుల్ కుతూష్(22) నల్లజర్లలో కళ్లజోళ్ల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని యాక్టివా బైక్‌పై రాజమహేంద్రవరం బయలుదేరాడు. జాతీయ రహదారిపై మార్గమధ్యంలో కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కుతూష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జుబేర్ మహమ్మద్ తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.లక్ష స్వాధీనం

అల్లవరం, ఏప్రిల్ 1: ఎన్నికల నేపథ్యంలో అల్లవరంలో ఎంపీడీవో టీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.1,00,400 స్వాధీనం చేసుకున్నారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన రఘు మోటారు సైకిల్ బ్యాగులో నగదు తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో ఆర్డీవో వద్దకు పంపించామని ఎంపీడీవో చెప్పారు. తనిఖీలో ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

ఇప్పటివరకు రూ.28.89 లక్షలు సీజ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటి వరకూ రూ.28,89,810 సీజ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఎన్నికల నిర్బంధ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్) పనితీరుపై సీజర్ నోడల్ ఏజెన్సీ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సీజ్ చేసిన నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన మెటల్, ఉచితాలు, ఇతర వస్తువుల డేటాను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలన్నారు. అధిక మొత్తాలపై నిఘా పెట్టాలన్నారు. రైల్వే, రోడ్డు రవాణా ద్వారా ఎక్కువ తరలింపులు ఉంటాయని తెలిపారు. తూర్పుగోదావరి ప్రధాన రహదారిలో ఉండడం వల్ల ఇతర ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గాన ఎన్నికల్లో పంపిణీకి వస్తువుల రవాణా జరుగుతుంటుందని చెప్పారు. జిల్లాకు వచ్చే కంటైనర్ల రికార్డులు పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రూ.50 వేలు కంటే ఎక్కువ నగదు దగ్గర ఉంటే ఆధారాలు చూపాలన్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఇప్పటివరకూ రూ.2 లక్షలు, అనపర్తిలో రూ.1,27,860, నిడదవోలులో రూ.1,50,000, గోపాలపురంలో రూ.1,20,000, రాజమహేంద్రవరం అర్బన్‌లో రూ.90 వేలు సీజ్ చేశామన్నారు. జిల్లా సీజర్ నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి కేవీ వెంక టేశ్వరావు, సెబ్ అధికారులు వి.సోమశేఖర్, కె.జయ మౌనిక, ఎల్‌డీఎం డీవీ ప్రసాద్, ఐటీ అధికారులు శీలం వీర బాబు, టీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర జీఎస్టీ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల తొలగింపు

ముమ్మిడివరం, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులతో తిరుగుతూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ముమ్మిడివరం నగర పంచాయతీ సూరాయిచెరువు గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీరును విధుల నుంచి తొలగిస్తున్నట్టు కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నగరం పంచాయతీ పరిధిలోని సూరాయిచెరువు గ్రామ సచివాలయం బాలయోగి కాల్వగట్టు క్లస్టర్-1 వలంటీరు విత్తనాల నాగార్జున గత నెల 30న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పితాని బాలకృష్ణ కర్నూలు జిల్లా గుత్తికొండలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ పార్టీలో చేరుతున్న సందర్భంగా వైసీపీ నాయకులతో కలిసి పాల్గొన్నాడు. ఈ మేరకు పత్రికల్లో కథనాలు వెలువడడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వలంటీరు నాగార్జునను విధుల నుంచి తొలగిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. ఆ వలంటీరు నుంచి మొబైల్, ఫోన్ సిమ్, బయోమెట్రిక్ డివైజ్‌లను స్వాధీనం చేసుకుని ఆ క్లస్టర్ పరిధిలో మరో వలంటీరు నియామకానికి చర్యలు చేపట్టాలని సచివాలయ కార్యదర్శికి కమిషనర్ ఆదేశాలిచ్చారు.

సఖినేటిపల్లి లంకలో..

అంతర్వేది, ఏప్రిల్ 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన సచివాలయం-1 ఎనిమిదో క్లస్టర్ వలంటీరు సేనాపతి పద్మాకర్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో టీవీ సత్యనారాయణ తెలిపారు. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా పోస్టు చేసిన కారణంగా అతన్ని విధుల నుంచి తొలగించామని వలంటీర్లు ఎవరు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదని, అలాగే వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఏపీపీఎస్సీలో అవకతవకలపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీలో జరిగిన అవకతవకలపై రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సీఎం జగన్, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో కుంభకోణానికి తెరతీశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఎంతోమంది నిరుద్యోగులను అన్యాయం చేసి పోస్టులను అమ్ముకున్నారని విమర్శించారు. కొన్ని పోస్టులను వారి అనుయాయులకు కట్టబెట్టుకున్నారన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు సాయిదీపక్ తదితరులు ఉన్నారు.

3500 క్యూసెక్కుల విడుదల

మోతుగూడెం, ఏప్రిల్ 1: డొంకరాయి జలాశయం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని శనివారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నారు. గోదావరి డెల్టా రబీ పంటలకు మార్చి 10 నుంచి సీలేరు కాంప్లెక్సులోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అయితే రబీ పంటలకు ఈ నీరు సరిపోకపోవడంతో ఇరిగేషన్ అధికారులు డొంకరాయి నుంచి అదనంగా మరో 3500 క్యూసెక్కుల నీటిని 5 రోజుల పాటు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయం నుంచి 3500 క్యూసెక్కుల నీటిని రబీకి విడుదల చేయాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం డొంకరాయి జలాశయం నుంచి 6,7 నెంబర్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీలేరు కాంప్లెక్సు నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 3500 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి లేకుండా జలాశయం నుంచి మరో 3500 క్యూసెక్కులతో కలిసి మొత్తం 7 వేల క్యూసెక్కుల నీరు రబీ పంటలకు సీలేరు నుంచి విడుదల అవుతుందని సీలేరు కాంప్లెక్సు సీఈ బి.శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్లు కేకేపీ ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వరరావు, ఈఈ బాలకృష్ణ, ఏడీఈ అప్పలనాయుడు, డీఈటీ వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 52మందికి ఉద్యోగాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 1: స్థానిక వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కేవైబీ మోటార్ సైకిల్ సస్పెన్షన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 52మంది ఎంపికైనట్టు వీఎస్ఎం వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఎంపికైన ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ గ్రూపు విద్యార్థులు 52మంది చెన్నై కేంద్రంగా పనిచేస్తారన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.బాలాజీ, ప్లేస్‌మెంటు అధికారి వి.రవీంద్ర, స్కిల్‌హెడ్ డా.జి.ప్రసాద్ పాల్గొన్నారు.

- లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్
- సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- గ్రామాల వారీగా పరిచయ కార్యక్రమాలు

కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలి

అంబాజీపేట, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా పనిచేద్దామని అమలాపురం లోక్‌సభ ఉమ్మడిఅభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. అంబాజీపేట వెంకట్రాజు ఆయిల్‌మిల్లు వద్ద పి.గన్నవరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణతో కలిసి ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉమ్మడి మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, అబ్జర్వర్ షేక్ సుభాన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, అరిగెల బలరామమూర్తి, చిన్నం బాలవిజయరావు, గుడాల ఫణి, దొమ్మేటి శ్యామ్, వక్కలంక బుల్లియ్య, మంద రాజేష్ పాల్గొన్నారు.




అంబాజీపేట: సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌మాధుర్, అంతర్వేది: దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో జనసేనలో చేరిన ఉపసర్పంచ్ సజీవమణిఏసు

అభివృద్ధి చేస్తానని నమ్మించి మోసం చేశారు

పి.గన్నవరం, ఏప్రిల్ 1: స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాగ్రామాన్ని అభివృద్ధి చేస్తానని నమ్మించి మోసం చేశారు, అందుకే సొంత గూటికి (టీడీపీ) మళ్లీ వచ్చేశానని ఉడిమూడి గ్రామసర్పంచ్ ఎన్.ప్రసన్నకుమార్ తెలిపారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎన్‌డీఏ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్, ద్విసభ్యకమిటీ సభ్యుడు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుల సమక్షంలో ప్రసన్నకుమార్ తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. గ్రామాభివృద్ధికి కృషిచేస్తామని హరీష్, గిడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, మద్దాల సుబ్బారావు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, రాణి రామకృష్ణ, ఎన్.సునీల్, అంబటి భూలక్ష్మి, ముచ్చర్ల సాయిసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, యర్రంశెట్టి సాయిబాబు, రాణి శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

అంతర్వేది, ఏప్రిల్ 1: అంతర్వేది దేవస్థానం గ్రామంలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆశయ సిద్ధాంతాలు నచ్చి ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ వైసీపీ ఉపసర్పంచ్ అయినపర్తి సజీవమణిఏసు జనసేనలో చేరారు. అలాగే వార్డు మెంబరు చిలకంపూడి వీరాస్వామిపాండురంగారావు, అయినపర్తి నవీన్, వైదాని శ్రీనివాసరావులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలనలో ఏవిధమైన అభివృద్ధి లేక ప్రజలకు సమాధానం చెప్పలేక నిరాశ చెంది ప్రజల కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి పవన్‌కల్యాణ్ అని భావించి పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. వరప్రసాద్ పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, రాష్ట్ర నాయకులు గెడ్డం మహలక్ష్మిప్రసాద్, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, పొన్నాల ప్రభ, పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జీనాయుడు, ఎంపీటీసీ భైరా నాగరాజు, రావూరి నాగు, ఉండపల్లి అంజి, దీపాటి మిథిన్, గుబ్బల ఫణికుమార్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉమ్మడి పార్టీల నాయకులు

రావులపాలెం,ఏప్రిల్1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బుధవారం రావులపాలెం, రామచంద్రపురంల్లో పాల్గొనే ప్రజాగళం బహిరంగ సభలను విజయవంతం చేయాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణరెడ్డి మాట్లాడారు. టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివచ్చేలా కృషిచేయాలన్నారు. జగన్ ఓటమి భయంతోనే వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు ఎగ్గొట్టేందుకు పన్నాగం పన్ని ప్రతిపక్షాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు మండలాలకు చెందిన టీడీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించాలి



అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణితో లక్ష్మి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1: వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, కార్యవర్గ సభ్యురాలు ఎంఎస్ఎస్వీ లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు తీవ్ర ఎండల ప్రభావంతో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వెయ్యి 1,200 జనాభా ఉన్నచోట్ల నిర్వహిస్తున్న మినీ సెంటర్లలో అన్ని పనులూ మినీ వర్కర్లే చేయాల్సి రావడంతో పనిభారం పెరిగిందన్నారు. వారికి కూడా వేసవి సెలవులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. జిల్లాలోని అనేక ప్రాజెక్టుల్లో ఏళ్ల తరబడి అంగన్‌వాడీ వర్కరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన హెల్పర్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా వాటిని భర్తీ చేయాలని కోరుతూ కృష్ణవేణి ఆధ్వర్యంలో మరో వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరిగిన పని భారంతో పాటు రకరకాల యాప్‌లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్కరు పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సీఆర్సీ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు

9,10,11 తేదీల్లో నాటక ప్రదర్శనలు

రావులపాలెం, ఏప్రిల్ 1: అంతరించిపోతున్న నాటక రంగాన్ని తెరమీదకు తేవడంతో పాటు పేద కళాకారులను ప్రోత్సహించేందుకు సీఆర్సీ కాటన్ కళా పరిషత్ విశేష కృషి చేస్తోందని కన్వీనర్ డాక్టర్ విక్టరీ వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రావులపాలెంలోని సీఆర్సీ కాటన్ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల9,10,11 తేదీల్లో 24వ ఉగాది ఆహ్వాన నాటక పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు తనికెళ్ల భరణి, ప్రముఖ దర్శకుడు వంశీ, హాస్య నటులు గౌతంరాజు, రామచంద్రరావు, కోట శంకరరావు హాజరవుతారన్నారు. మన ప్రాంత సినీ దర్శకులకు సీఆర్సీ పౌర సన్మానం, నాటక రచయిత కుమార్తెకు సీఆర్సీ ఆర్థిక సాయం, సాహస బాలికలకు సీఆర్సీ సత్కారం ఉంటాయన్నారు.

ప్రదర్శించే నాటికలు ఇవే:

9వ తేదీన గంగోత్రి పెదకాకానివారి హస్తికలు, పండు క్రియేషన్స్ ఒంగోలు వారి పక్కింటి మొగుడు, 10న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటి పువ్వు, సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి థింక్, మల్లాడి క్రియేషన్స్ హైదరాబాద్ వారి చీకట్లో సంద్రుడు, 11న అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం, మైత్రి కళానిలయం విజయవాడ వారి బంధం... అనంతరం సీఆర్సీ రావులపాలెం వారి శ్రీకృష్ణాంజనేయం ప్రత్యేక ప్రదర్శన ఉంటాయి.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: ఆనందరావు





అమలాపురం: ప్రచారం చేస్తున్న అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం: దింపు కార్మికులకు మేనిఫెస్టోను వివరిస్తున్న దాట్ల బుచ్చిబాబు, ఐ.పోలవరం: జయహో బీసీలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1: అప్పులు చేస్తే గానీ సంక్షేమ పథకాలు అమలు చేయలేని దుస్థితికి రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం తీసుకువెళ్లిందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. సూపర్-6 పథకాలను వివరిస్తూ ఆయన పట్టణ పరిధిలోని ఒకటో వార్డులో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలని కోరారు. వార్డు ఇన్‌చార్జి మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, నాయకులు అల్లాడ స్వామినాయుడు, చిక్కాల గణేష్, చెరుకూరి సాయిరామ్, పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆశెట్టి ఆదిబాబు, పొలమూరి ధర్మపాల్, కుసుమ సూర్యమోహనరావు, నల్లా స్వామి, దెందుకూరి సత్తిబాబురాజు, అధికారి జయవెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతా

ముమ్మిడివరం, ఏప్రిల్ 1: ముమ్మిడవరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. అనాతవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దాట్ల పృథ్వీరాజ్, దొమ్మేటి రమణకుమార్, మిమ్మితి చిరంజీవి, కురసాల శివబాబు, దంగేటి శ్రీనివాసరావు, పేరిచర్ల సురేష్‌రాజు, గుబ్బల తాతబ్బాయి, వాసంశెట్టి పట్టాభిరామయ్య, పెయ్యల వెంకటరమణ, మునికోటి ఏసుబాబునాయుడు, వాసంశెట్టి స్వామి, మునుకోటి జాజి, కుంచే శ్రీను, చెల్లి శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు పెద్దపీట

ఐ.పోలవరం, ఏప్రిల్ 1: టీడీపీ హయాంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం లభించిందని క్లస్టర్ ఇన్‌చార్జి సాగిరాజు సూరిబాబురాజు అన్నారు. ఐపోలవరంలో సోమవారం టీడీపీ ఆరవ క్లస్టర్‌లో సోమవారం జయహో బీసీ సదస్సు జరిగింది. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు 50ఏళ్లకే నెలానెలా రూ.4,000 పెన్షన్ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాకర్లపూడి రాజేష్, లంకే శ్రీనివాసరావు, అప్పారి సత్తిబాబు, బొంతు ప్రసాద్, కడలి ఉమామహేశ్వరరావు, ఇళ్ళ రాంబాబు, పిల్లా గోపి, బొంతు శ్రీరాములు, నవరపు రమణ, బొంతు శ్రీను, అల్లూరి వెంకన్నబాబు, పెన్మెత్స శరత్ తదితరులు పాల్గొన్నారు.

రాము కార్టూన్‌కు జ్యూరీ అవార్డు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 1: నార్త్ కోస్టల్ ఆంధ్రా కార్టూన్స్ ఫోరం విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్టూన్స్ పోటీల్లో బండారులంకకు చెందిన మాడా రాము గీసిన వ్యంగ్య చిత్రానికి ప్రత్యేక జ్యూరీ అవార్డు దక్కింది. ఈనెల14న విజయవాడలో జరిగే కార్యక్రమంలో రాము అవార్డు అందుకోనున్నారు. విదేశాలకు వెళ్లిపోయి స్వగ్రామంలో ఆయినవారిని, కుటుంబ సభ్యులను నిర్లక్ష్యంగా వదిలేసిన మనస్తత్వాలను వివరిస్తూ రాము గీసిన కార్టూన్ ఆకట్టుకుంది.

ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలి

ఆత్రేయపురం, ఏప్రిల్ 1: గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి(రాము) కోరారు. వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు తక్షణం అందించేలా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

హైస్కూల్‌కు ప్రింటర్ బహూకరణ

మలికిపురం, ఏప్రిల్ 1: కేశనపల్లి జడ్పీ హైస్కూల్‌కు ప్రముఖ కాంట్రాక్టరు అడబాల లక్ష్మీనరసింహమూర్తి రూ.25వేలు విలువైన ప్రింటర్‌ను సర్పంచ్ యెనుముల నాగు చేతులమీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ అడ్డుకున్న పాపం సీఎం జగన్‌దే

మండపేట, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీని సీఎం జగన్ రాజకీయం చేసి లబ్ధి పొందాలని ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీని కూటమి అడ్డుకుందని చేస్తున్న వైసీపీ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నేటి వరకు పింఛన్ల నగదు బ్యాంకు ఖాతాలకు చేరలేదన్నారు. ఇప్పటికే చేయూత, ఆసరా, విద్యాదీవెన వంటి పథకాలకు బటన్ నొక్కిన సీఎం జగన్ మూడు నెలలు కావస్తున్నా నేటివరకు లబ్ధిదారులు ఖాతాల్లో నగదు జమకాలేదన్నారు. అడ్డగోలుగా తమ గుత్తేదారులకు రూ.13,000కోట్లు దారి మళ్లించిన విషయంపై సమాధానం చెప్పాలని వేగుళ్ల ప్రభుత్వాన్ని వేగుళ్ల డిమాండ్ చేశారు. ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని ఆయన పిలుపు నిచ్చారు. వైసీపీ మాటలు నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. సమావేశంలో టీడీపీ నేతలు ఏఎంసీ మాజీ ఛైర్మన్ సూరంపూడి గనిరాజు, కుక్కల రామారావు, వాదా ప్రసాదరావు చింతపల్లి రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ కేతా

రాజోలు, ఏప్రిల్ 1: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యానికి సోమవారం కొత్తపేటలో ఎంపీపీ కేతా శ్రీను పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అక్కడే ఉన్న జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, టీడీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముదునూరి చినబాబు, చాగంటి స్వామి, కపురు శ్రీను, రాపాక నవరత్నం, గోనెపాటి రాజు, బాబ్జి రాజు, సాయిరాజ్, కోళ్ల కృష్ణ, టీడీపీ రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సాగి పాపయ్యరాజు, చిట్టూరి సంతోష్ తదితరులు సుబ్రహ్మణ్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ కూటమికి మద్దతు: ఎమ్మెల్యే

యానాం. ఏప్రిల్ 1: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై స్థానిక ఎమ్మెల్యే, బీజేపీ యానాం ఎన్నికల ఇన్‌చార్జ్ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లోని గాజుల మినీ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం అభివృద్ధి కోసమే స్వతంత్ర ఎమ్మెల్యేగా పుదుచ్చేరిలో బీజేపీ కూటమికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న నమశ్శివాయకు మద్దతుగా ఓటు వేయాలని ప్రజలను ఆయన కోరారు. అనంతరం యానానికి సంబంధించిన పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో యానాం బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు తదితర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

మండపేట, ఏప్రిల్ 1: స్థానిక గొల్లపుంతకాలనీలో టిడ్కో గృహ సముదాయం ఏ32 ప్లాట్ ఎఫ్ఎఫ్-7లో సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఇంటి యజమాని తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. స్థానికులు మంటలు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఇంటిలో ఉన్న ఫ్రిజ్, టీవీ,సామగ్రి కాలి పోయాయి. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం ఏర్ప డింది. ఇంటి యజమాని చల్లా లక్ష్మి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆమె కుమార్తె బాలింత. కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు.

కె.గంగవరంలో చలివేంద్రం ఏర్పాటు

కె.గంగవరం, ఏప్రిల్ 1: కె.గంగవరంలో మన గంగవరం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమించొద్దు

అల్లవరం, ఏప్రిల్1: రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని అతిక్రమించకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో కృష్ణమోహన్ కోరారు. గురువారం వారు తహసీల్దారు కార్యాలయం వద్ద రాజకీయ నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ఈవోపీఆర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, ఆర్ఐ ఎం.దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

గణిత పాఠ్య పుస్తకం ఆవిష్కరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వ తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో రూపొందించిన స్కూలు అసిస్టెంట్ గణిత పాఠ్య పుస్తకాన్ని జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి సోమవారం ఆవిష్కరించారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పుస్తక రచయిత, గణితావధాని డాక్టర్ టీఎస్వీఎస్ సూర్యనారాయణమూర్తిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఈపుస్తకం ఎంతో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎం.కమలకుమారి, అమలాపురం, రామచంద్రపురం డీవైఈవో ఎస్.లక్ష్మీనరసింహవణి, జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యనిర్వాహాధికారి బి.హనుమంతరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సురేష్, బొజ్జా రమణశ్రీ, బందా ఆర్.కామేశ్వరరావు, పి.పల్లయ్యశర్మపాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం

అంబాజీపేట, ఏప్రిల్ 1: ఉమ్మడి పార్టీ కలయికతో బీజేపీ మాదిగలకు అన్యాయం చేసిందని దండోరా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పుల్లేటికుర్రులో బీజేపీ నాయకుడు కొల్లి సూర్యారావు స్వగృహం వద్ద దండోర నాయకుల సమావేశం జరిగింది. పిగన్నవరం టిక్కెట్ జనసేనకు కేటాయించి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. సమావేశంలో బొమ్మి బాలరాజు, తొత్తరమూడి గోవిందు, భీమన్న, లూటుకుర్తి సత్యనారాయణ, కొడమంచిలి రమణ, కొల్లి గంగాధర్, నేదునూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో ప్రథమ స్థానం

అమలాపురంటౌన్, ఏప్రిల్1: అమలాపురం పురపాలక సంఘం 2023-24 ఆర్థిక సంవత్సరానికి 85.1శాతం ఇంటి పన్నులు వసూలుచేసి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని కమిషనరు ఎస్.మనోహర్ తెలిపారు. ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించడంతో మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది నెలపాటు అహర్నిశలూ శ్రమించి పట్టణ ప్రజల నుంచి 85శాతం పన్నులు వసూలుచేశారు. కమిషనరు మనోహర్ ఆధ్వర్యంలో ఆర్ఐలు పల్లి వెంకటేశ్వరరావు, పి.రాహుల్, 15సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, కీలక పాత్ర పోషించిన ఆర్వో శివాజీ తదితరులను అభినందించారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముమ్మిడివరం, ఏప్రిల్1: యానాం నుంచి ఏలూరు జిల్లా కలిదిండి మండలం పటమటపాలేనికి చెందిన మంజుల సతీష్‌కుమార్, నడకుదిటి బాలకృష్ణలు బొలేరో వాహనంలో 2100లీటర్ల డీజిల్‌ను అక్రమంగా తలిస్తుండగా పోలీసులు డీజిల్‌ను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టుచేసి, కేసుదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: కలియుగ పట్టణంలో
వెంకటరమణ	: ప్రేమలు
శ్రీలలిత	: గో ఎట్ లైఫ్
శేఖర్ స్క్రీన్-1	: ఓం భీమ్‌బుష్
శేఖర్ స్క్రీన్-2	: తలకోన
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఊరిపేరు భైరవకోన
వెంకటపద్మావతిస్క్రీన్-1	: డీజేటిల్లు స్క్వేర్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

దివ్యాంగ బాలలకు వైద్య పరీక్షలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 1: ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగ బాలలకు వైద్య పరీక్షల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అదనపు పథసంచాలకుడు ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీ సత్యనారాయణ, ఎఫ్ఏవో బి.ప్రవీణ్‌కుమార్, ఏఎంవో పి.రాంబాబు, ఏపీవో ఎంఏకే భీమారావు పాల్గొన్నారు. సహిత కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ కళ్లజోళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు అందిస్తామన్నారు. ఆర్థో ఎస్.వినయ్‌కుమార్, ఆడియాలజిస్టు ఎం.నీలిమ, ఈఎన్‌టి టి.వినయ్‌కుమార్, ఆప్తమాలజిస్టు చందన వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు, దివ్యాంగ చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ కుంభకోణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 1: ఏపీపీఎస్సీలో జరిగిన కుంభకోణంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు యువత అమలాపురం పార్లమెంటరీ అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు ఆధ్వర్యంలో సీఎం జగన్, గౌతమ్‌సవాంగ్‌లపై టీడీపీ శ్రేణులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగుయువత పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు మాద్దాల సుధీర్‌రాజా, ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి ఈశ్వర్, నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షుడు అంచూరి రమేష్, అయినవిల్లి మండల తెలుగుయువత అధ్యక్షుడు మేడిశెట్టి అంజిబాబు, గుత్తుల రామకృష్ణ, పడమట సత్యనారాయణ పాల్గొన్నారు.

పింఛన్లు వెంటనే అందించాలి

మలికిపురం, ఏప్రిల్ 1: పింఛన్లను వెంటనే అందజేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కోరారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వినతిపత్రం పంపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ తప్పును ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4వేలు ఇస్తామని పార్టీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ర్యాలీని విజయవంతం చేయండి

యానాం. ఏప్రిల్ 1: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రస్తుత ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి వి.వైద్యలింగం మంగళవారం యానాం రానున్నారు. వైద్యలింగం, నారాయణస్వామి బృందానికి స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నిఏర్పాట్లు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ యానాం ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థాని దినేష్ తెలిపారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానం నుంచి ర్యాలీ నిర్వహిస్తారు.

భార్య మృతి కేసులో భర్తకు రెండేళ్లు జైలుశిక్ష

రాయవరం, ఏప్రిల్1: వేధింపులతో భార్య మృతికి కారణమైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్‌కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పారని రాయవరం ఎస్ఐ జి.నరేష్ సోమవారం తెలిపారు. కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం దేవికి రాయవరానికి చెందిన పిచ్చుక బుల్లియ్యతో వివాహమైంది. కొంతకాలం తర్వాత బుల్లియ్య భార్య దేవిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశాడని, అల్లుడు వేధింపుల వల్ల తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి జక్కం వీరవెంకట సత్యనారాయణ 2015లో పోలీసులు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ సురేష్‌బాబా కేసు నమోదు చేశారు. కోర్టులో వాదనలు అనంతరం ఈకేసులో ఏ1గా ఉన్న బుల్లియ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పినట్టు ఎస్ఐ తెలిపారు. ఫిర్యాదుదారుడు తరఫున పీపీ ఎంవీవీ సూర్యప్రకాష్ వాదనలు వినిపించారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

ఆలమూరు, ఏప్రిల్ 1: చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై ఒక కారు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈశ్వరరావు ద్విచక్ర వాహనంపై చొప్పెల్ల వద్ద డివైడర్ దాటుతుండగా రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న వాహనం బలంగా ఢీకొట్టింది. కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. గాయపడ్డ ఈశ్వరరావును హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తరలించారు. డివైడర్‌పై ఉన్న కారును హైవే సిబ్బంది క్రేన్ సహాయంతో పక్కకు తప్పించారు.

హజరత్ అలీ షహదత్

మామిడికుదురు, ఏప్రిల్ 1: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ అలీ వర్థంతి(షహదత్)ను సోమవారం నిండు శోకంతో జరుపుకున్నారు. నగరంలోని మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మర్షియా ఆలపిస్తూ పెదపంజీష వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం షహదత్ మజ్లిస్ జరిగింది. కూఫా పట్టణంలో హజరత్ అలీపై జరిగిన దాడిని మత ప్రబోధకుడు మెహదీహసన్ బెహెస్తి భక్తులకు వివరించారు. అనంతరం హజరత్ ఆలీకి నివాళులర్పిస్తూ మాతం చేశారు. మామిడికుదురు, నగరం, మొగలికుదురు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

అమలాపురం టౌన్: షియాల ఆరాధ్య దైవం, మొదటి ఖలీఫా మహ్మద్ ప్రవక్త అల్లుడైన హజరత్ ఇమామ్ ఆలీ వర్ధంతిని సోమవారం జరుపుకున్నారు. పట్టణంలోని ముజాఫర్ సందులోని ఆస్తానే అబ్బాషియా పీర్ల పంజాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్ల పంజాలో ఇమామ్ ఆలీ వర్ధంతి విశిష్టతను ఒడిసా నుంచి వచ్చిన మత గురువు మహ్మద్ హైదర్‌ఆలీ కళ్లకు కట్టినట్టు వివరించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు నిస్సార్ హుస్సేన్, కార్యదర్శి ఇర్రార్ హుస్సేన్ తదితరులు పాల్గొనగా దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ప్రపంచమంతా శాంతితో వర్థిల్లాలని ప్రార్థనలు జరిపారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో ఇమాంఅలీ వర్ధంతిని సోమవారం ముస్లింలు నిండుశోకంతో జరుపుకున్నారు. కుఫా దేశంలో ఇమాం అలీ నమాజ్ చేస్తుండగా విషం పూసిన కత్తితో సంఘ విద్రోహులు శిరస్సును ఛేదించారు. విషాద సంఘటనను స్మరించుకుని రంజాన్ నెలలో 21వరోజు షహదత్ పాటిస్తారు. మూడు రోజులు విషాద వాతావారణంలో మజిలీస్ ఆలపించారు. నఖల్ ముబారక్(గుమ్మటం) ఊరేగింపు జరిపారు. మీర్జాఅస్కరి హుస్సేన్ మజిలీస్ ఆలపించారు. విషాద గేయంతో ఊరేగింపు జరిపారు.

నిత్యాన్నదానానికి రూ.25,116 విరాళం

మామిడికుదురు, ఏప్రిల్ 1: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి సోమవారం కొత్తపేటకు చెందిన మల్లంపల్లి శేషగిరి రూ.25,116 విరాళంగా అందించారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి సిబ్బంది అభినందించారు.

ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

మామిడికుదురు, ఏప్రిల్ 1: బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా పేర్కొన్నారు. సోమవారం గెద్దాడ గ్రామంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మెండా ఆదినారాయణ, అడబాల రాంబాబు, అడబాల సత్యనారాయణ, కంకిపాటి సుబ్బారావు, మాలే శ్రీనివాసనగేష్, అడపా వెంకటరత్నం. నక్కా త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, ఏప్రిల్ 1: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన దుద్దిపూడి శ్రీధర్-పద్మజ దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,27,195 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

నవోదయకు ఇద్దరు ఎంపిక

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 1: మాచర శివారు శ్రీరామపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి చొల్లంగి రుద్రాన్ష్, అంగరలోని శ్రీరామకృష్ణ పబ్లిక్ స్కూల్ నుంచి కె.శ్రీలిఖిత నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఎంఈవో కె.తాతారావు తెలిపారు. వీరికి ఇంటర్ వరకు ఉచిత విద్య అందజేస్తారని తెలిపారు. వీరిని ఎంఈవో తాతారావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, అభినందించారు.

ఎన్నికల ప్రచారానికి డిజిటల్ వాహనం బహూకరణ

ఆలమూరు, ఏప్రిల్ 1: వచ్చేఎన్నికల్లో టీడీపీ చేపట్టే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సవివరంగా తెలియజేసేలా రూపొందించిన డిజిటల్ వాహనాన్ని ఆలమూరుకు చెందిన మురళీకృష్ణ సంస్థల వారసుడు వంటిపల్లి మురళీకృష్ణ సోమవారం కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావుకు అందజేశారు. మురళీకృష్ణను సత్యానందరావు, పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించిన వారిపై చర్యలు తీసుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 1: ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించిన సీఎం జగన్, ఆయనకు సహకరించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణరావు డిమాండు చేశారు. సోమవారం రామచంద్రపురం పార్టీ కార్యాలయంలో జరిగిన టీడీపీ ఎస్సీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గంటి హరీష్ మాధుర్, వాసంశెట్టి సుభాష్‌లను గెలిపించాలని కోరారు. టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతుల మాధవ్, పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనుబాబు, బొమ్ము లక్ష్మణరావు, జొన్నకూటి భాస్కరరావు, దడాల నాగార్జున, మోర్త చినబాబు పాల్గొన్నారు.

నవోదయకు 60మంది ఎంపిక

యానాం. ఏప్రిల్ 1: యానాం మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వతరగతి ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన ప్రవేవ పరీక్షలో 80మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. ఈపరీక్షలకు 460మంది హాజరుకాగా 80మంది ఎంపికయ్యారు. వీరందరికి ఈనెల15 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయి. జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఫ్రిబవరి 10న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 160మంది విద్యార్థులు హాజరుకాగా 13మంది ఎంపికయ్యారన్నారు.

జనరల్ నోటీసు పబ్లికేషన్

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
క్రెడిటర్ ఐ.పి.నెం.8/2024

బిట్వీన్:

GOLUGURI VENKATA PRAVEEN KUMAR REDDY
S/o Late Narayana reddy age 48 years, Business and Cultivation, R/o D.No.14-13-20, Surya Nagar, RAMACHANDRAPURAM, Ramachandra puram Mandal, Konaseema District. Aadar No. 4671 3558 2336. RCPM PJCJ ... పిటిషనర్

అండ్

1. KAMIREDDI TATAJI
S/o Nagaraju, age 45 years, Business and Cultivation, R/o D.No.2-56/a, PASALAPUDI Village,Rayavaram Mandal, Dr.B.R.Ambedkar Konaseema District. Anaparthi JCJC
2. KAMIREDDI NAGA SATYA SIVA PRAVEEN
age about 23 years, Student, S/o Tataji, R/o D.No.2-56/a,PASALAPUDI Village, Rayavaram Mandal, Dr.B.R.Ambedkar Konaseema District Anaparthi JCJC
3. KAMIREDDI KUSUMALATHA DEVI
S/o Tataji, age about 20 years, Student, R/o D.No.2-56/a, PASALAPUDI Village, Rayavaram Mandal, Dr.B.R.Ambedkar Konaseema District, Anaparthi JCJC
4. MALLIDI SAI BABA REDDY
S/o Sathi reddy, age about 50 years, Document writer, R/o D.No.4-17, PASALAPUDI Village, Rayavaram Mandal, Dr.B.R.Ambedkar Konaseema District. Anaparthi JCJC .... రెస్పాండెంట్స్

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు గల క్రెడిటర్ ఇంసాల్వెన్సీ పిటిషన్ లో పిటిషనర్ ఐన వారు ఇందలి పై 1వ రెస్పాండెంట్స్ ఇన్సాల్వెంట్ రుణగ్రస్తులుగా డిక్లేర్ చేస్తూ 1వ రెస్పాండెంటు 2 మరియు 3 రెస్పాండెంట్ల తో కలిసి 4వ రెస్పాండెంట్ పేరున ది.ది.12-06-2023 సం.రం తేదీన రామచంద్రపురం సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీసులో వ్రాయించి రిజిస్టర్ చేయించి ఇచ్చిన దస్తావేజు నెం. 3336/2023 కు గల క్రయ దస్తావేజును రద్దు పరచమని కోరుచు శ్రీయుత పై కోర్ట్ వారి ఎదుట CREDITOR INSOLVENCY పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో శ్రీ కోర్ట్ వారు ది.ది.19-04-2024 సం రం తేదీ నాటికి వాయిదా వేసినారు. కావున్ ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై Cr.I.P లో ఎవరికైనా ఏవిధములైన అభ్యంతరములు లాసీ క్లైములు కాని వున్న యెడల సదరు పై తేదీన ఉదయం 10-30ని లకు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై తమ అభ్యంతరములు తెలియపరచు కొనవచ్చును.

శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా తేదీ . ది.ది. 19-04-2024.

రామచంద్రపురం
Dt.01-04-2024

T.S.S.S.N.CHALAPATHI KUMAR
ADVOCATE